క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం లోక కల్యాణార్థం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, సేవా సమితి సభ్యులు భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. తొలుత స్వామివారికి ఆకుపూజ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, సేవా సమితి సభ్యులు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వారిపై కేసు నమోదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):భవానీపురంలో నివాసముంటున్న ఒక మహిళ అత్తింటి వారు తనపై హత్యాయత్నానికి ప్రయత్నించినట్లు భవానీపురం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .... కొట్టు రాజేశ్వరి తన భర్త యశ్వంత్‌తో కలిసి భవానీపురంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. వారికి 2012లో వివాహం కాగా వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో రాజేశ్వరిని అత్తింటి వారు వేధించి ఇబ్బందులకు గురి చేస్తే అప్పట్లో పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆ తరువాత పెద్ద మనుషులు మధ్య రాజీ కుదిర్చి కాపురం చేసే విధంగా చేశారు. అయితే జూలై 29వ తేదీన తన అత్తమామలు, మరిది తనతో అనవసరంగా గొడవ పెట్టుకొని దాడి చేశారు. బూతులు తిడుతూ చంపాలంటూ గట్టిగా ఒకరినొకరు అర్చుకుంటూ తీవ్రంగా కొట్టారు. అంతలో చుట్టుపక్కల వాళ్లు వచ్చేసరికి తనను వదిలేసి వెళ్లిపోయారు. అనంతరం అత్తింటి వారే రాజేశ్వరి పుట్టింటి వారికి ఫోన్ చేసి పిలిపించారు. దాంతో వారు రాజేశ్వరిని తీసుకొని వెళ్లి గుంటూరులోని ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అక్కడ మెడికల్ సర్టిఫికెట్ వచ్చిన తరువాత ఆమె భవానీపురం పోలీసుస్టేషన్‌కు వచ్చి ఆదివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసి గాయపరిచిన వ్యక్తులపై కేసు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):కళాశాలలో లా చదువుతున్న యువకుడిపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తులపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లపూడిలో మండల వెంకటసాయి కిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. వెంకటసాయికిరణ్ కాకినాడలోని ఒక కళాశాలలో లా చదువుతున్నాడు. సెలవులు రావటంతో ఈ నెల మూడో తేదీన గొల్లపూడి తన స్వగృహానికి వచ్చాడు. ఈ నెల తొమ్మిదో తేదీన ఇబ్రహీంపట్నంలో వివాహం ఉండటంతో అక్కడకు వెళ్లి రాత్రి 12.15 గంటల సమయంలో తిరిగి ఇంటికి పయనమయ్యాడు. ఆ క్రమంలో దారిలో ఆకాష్, బాజీ, వేణు, నాగరాజు, శ్రీను, అర్జున్, వికాస్, రమణ, ప్రసాద్ తదితరులు వెంకటసాయికిరణ్‌ను అతని ద్విచక్ర వాహనాన్ని అడ్డగించి కిందకు పడవేసి తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితుడు తల్లిదండ్రులకు విషయాన్ని వివరించి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో దుర్భాకుల విశ్వనాథశర్మ తన కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. అష్టాక్షరీ ఆశ్రమంలో వేదపండితుడిగా పని చేస్తున్నాడు. విశ్వనాథశర్మ ఈ నెల మూడో తేదీన తన కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామమైన అడవిరావుల పాడు (నందిగామ మండలం)కు వెళ్లాడు. ఈ నెల ఎనిమిదో తేదీన విశ్వనాథశర్మకు ఇంటి పక్కన వారు ఫోన్ చేసి మీ ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నట్లు చెప్పారు. దీంతో వారంతా ఇంటికి వచ్చి చూడగా లోపల ఉన్న సరుకులు, వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అలాగే ఇంట్లో ఉండాల్సిన పది గ్రాముల బంగారపు వస్తువులు, 1200 గ్రాముల వెండి కంచాలు, కొంత నగదు దొంగిలించినట్లు గుర్తించారు. దానిపై ఆదివారం భవానీపురం పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద ఉధృతికి అప్రోచ్ రోడ్డు ధ్వంసం

వీరులపాడు: ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ఎగువ నుంచి వచ్చిన వరద ఉధృతికి పల్లెంపల్లిలోని వైరాకట్టలేరు అప్రోచ్ రోడ్డు ధ్వంసమైంది. ఈ రోడ్డు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతుండటంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వరదల కారణంగా రహదారిపై ఉన్న సిమెంట్ దిమ్మెలు దెబ్బతిన్నాయి. వైరా కట్టలేరుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిగాకపోవడంతో వరదల సమయంలో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరదల సమయంలో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కూటమి పాలనలో సచివాలయాలు నిర్వీర్యం!

- కార్యాలయాలకు వెళితే సమాధానం చెప్పే వారు కరువు
- పలుచోట్ల సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పథకాల మంజూరుకు అవస్థలు



పశ్చిమ నియోజకవర్గంలో సచివాలయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ప్రజల వద్దకే పాలన లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నీరుగారుస్తుంది. గత ప్రభుత్వంపై అక్కసుతో, దురుద్దేశంతో వ్యవహరిస్తోంది. సిబ్బందితో, పథకాల లబ్ధిదారులతో సందడిగా ఉన్న సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. పలుచోట్ల సిబ్బంది కొరతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సచివాలయాల్లో నేడు సమాధానం చెప్పేవారే కరువయ్యారు. గతంలో డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, ఉద్యాన శాఖ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, సెరీ కల్చర్, మత్స్యశాఖ సిబ్బంది అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం వీరంతా ఇతర శాఖలకు డెప్యుటేషన్ మీద వెళ్లారు.

ముగ్గురుతో నడుస్తున్న సచివాలయాలు

సచివాలయాల్లో సిబ్బందిని తగ్గించడంతో పాటు కూటమి ప్రభుత్వం సేవల్ని కూడా కుదించింది. సచివాలయాల ద్వారా గతంలో 526 సేవలు అందితే, ప్రస్తుతం పట్టుమని పది సేవలు కూడా అందడంలేదని ప్రజానీకం వ్యాఖ్యానిస్తుంది. అదేవిధంగా సేవలు అందకపోవటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం విస్తృతమైన ఆలోచనతో ప్రజల వద్దకే పరిపాలనను అందించే లక్ష్యంతో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థలో పూర్తిస్థాయిలో నాడు అందించిన సేవలు నేడు అందుబాటులో లేవు. దాంతో కొన్ని సేవలకు ఎక్కడకు వెళ్లాలో తెలియన ప్రజానీకం సతమతమవుతున్నారు.

పశ్చిమంలో 90 సచివాలయాలు

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ఆయా డివిజన్ల పరిధిలో సుమారుగా 90 సచివాలయాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సచివాలయాల్లో ఎనిమిది నుంచి పది మంది సిబ్బంది సేవలందించేవారు. సుమారు 700 మంది కార్యదర్శులు ఇతర సిబ్బంది ఆయా సచివాలయాల్లో పని చేసేవారు. నేడు సచివాలయాల్లో కేవలం మూడు నుంచి ఎనిమిది మంది మాత్రమే సిబ్బంది పని చేస్తున్నారు. ఉన్న ముగ్గురు నలుగురు సిబ్బంది ఆయా విధుల్లో భాగంగా వార్డుల్లోకి వెళ్లితే సచివాలయాలకు తాళాలు వేసి వెళ్లే పరిస్థితులు ఉన్నాయి.

ఇతర శాఖలకు బదిలీలు

నియోజకవర్గంలోని ఆయా సచివాలయాలను నీరుగార్చే లక్ష్యంతో అందులో పని చేస్తున్న సిబ్బందిని ప్రభుత్వం ఇతర శాఖలకు బదిలీలు చేస్తోంది. ఆ క్రమంలో 90 సచివాలయాల్లో ఉన్న సిబ్బందిలో సుమారు 20 నుంచి 25 శాతం సిబ్బందిని ఇతర శాఖలకు డెప్యూటేషన్‌పై బదిలీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో సుమారు 150 నుంచి 200 వరకూ సిబ్బంది బదిలీపై వెళ్లినట్లు సమాచారం.

అవస్థలు పడుతున్న ప్రజానీకం...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ప్రజలకు సచివాలయాల ద్వారా పలు సేవలు అందేవి. పింఛన్లకు దరఖాస్తులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, బిల్ పేమెంట్స్, దివ్యాంగులకు సదరన్ పత్రాలు... ఇలా దరఖాస్తులు చేసుకుని సత్వరమే పొందేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాకా లయాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరిగినా ప్రయోజనం ఉండటం లేదు. దీంతో మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. మరికొన్ని సేవలకు మీ సేవా కేంద్రాలకు వెళ్లి వంద రూపాయలు ఇచ్చి పనులు చేయించుకోవాల్సి వస్తోంది. కులం, ఆదాయం, అడంగల్ టైటిల్ డీడ్, రెవెన్యూ పరమైన కీలకమైన సేవలు సచివాలయాలలో అందకపోవడంతో చిన్నపాటి పనులకు సైతం ఇతర కేంద్రాలకు వెళ్లక తప్పడం లేదు.

వీఎంసీలో నేడు పీజీఆర్‌ఎస్

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగరంలోని 64 డివిజన్లలో వీఎంసీ కల్పిస్తున్న మౌలిక వసతుల కల్పనలో సమస్యలు ఉత్పన్నమైతే వాటి పరిష్కారానికి వీఎంసీ ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్‌ఎస్) నిర్వహిస్తుందని కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వీఎంసీ ప్రధాన కార్యాలయం, చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయం, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో జోనల్ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

17న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17వ తేది ఆదివారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు సేవా సంఘం ప్రధాన కార్యదర్శి దశరథ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిచయ వేదికలో పాల్గొనేవారు స్వయంగా వేదిక దగ్గర, లేదా 99660 96999, 96181 93027 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

చిట్టడవుల్లా ఖాళీ స్థలాలు!

- వర్షపు నీరు నిలిచి తటాకాలుగా మారుతున్న వైనం
- కీటకాలు, దోమలతో స్థానికుల ఇబ్బందులు
- అధికారులు స్పందించాలని వినతి



భవానీపురం వీఎంసీ కల్యాణ మండపం పక్కన ఖాళీ స్థలంలో అడవిని తలపిస్తున్న పిచ్చి చెట్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురంలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపిస్తుంటే మరికొన్ని బురదకయ్యాలుగా దర్శనమిస్తున్నాయి. పిచ్చి మొక్కలు, చెట్లు ఏపుగా పెరగడంతో స్థానికంగా నివాసం ఉండే వాళ్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి ఖాళీగా ఉండడంతో చెత్తాచెదారం, భవనాలు కూలిచేసినపుడు వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో వర్షపు నీరు నిలిచిపోతోంది. రోజుల తరబడి నీరు నిలిచి పరిసరాలు దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు వ్యాప్తి చెంది స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ ప్లాట్లలో చెట్లు పెద్దగా పెరిగి పక్కన ఇళ్ల కిటికీలు, ప్రహరీలపైకి కొమ్మలు వెళుతున్నాయి. రకరకాల కీటకాలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. 43వ డివిజన్ పరిధిలోని హెచ్‌బీ కాలనీ వీఎంసీ కల్యాణ మండపం పక్కనే ఉన్న ఖాళీ స్థలం కొద్దిపాటి అడవిని తలపిస్తోంది. పిచ్చి చెట్లు, కంపచెట్లు పెద్దగా పెరిగాయి. బిల్డింగ్ వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. కొన్నాళ్లుగా చెట్లు తొలగించకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి పడమర వైపు ఖాళీ స్థలంలో లారీలు, ప్రైవేటు కళాశాలల బస్సులు నిలిపివేస్తున్నారు. వాహనాలు తిరగడంతో గుంతలు ఏర్పడి వాటిలో వర్షపు నీరు చేరి నిల్వ ఉంటుంది. ఎకరాల్లో ఉన్న ఈ స్థలం చుట్టు పెద్ద పెద్ద ఇళ్ల నిర్మాణం జరిగింది. ఖాళీ స్థలంలో వ్యర్థాలు వేయడంతో అక్కడ వారు కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

తటాకంలా రహదారి....

ఈ స్థలాలకు మధ్యలో ఉన్న రోడ్డు తటాకంలా మారింది. బురదతోపాటు అందులో చేరిన వ్యర్థాలు కలిసి దుర్వాసన వస్తోంది. ఊర్మిళానగర్ ప్రధాన రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలంలోకి ఆ ప్రాంతంలోని మురుగు చేరుతోంది. చుట్టూ ఆవాసాల వారు అసౌకర్యానికి గురవుతున్నారు. అక్కడే డంపర్ బిన్‌లు పెట్టడంతో అవి పొర్లిపోయి చెత్తంతా మురుగుతో కలిసి పరిసరాల్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. రిలయన్స్ వెనుక భాగంలో ఖాళీ స్థలాల్లో నెలల తరబడి మురుగు నీరు నిలిచి దోమల వ్యాప్తి చెందుతున్నాయి. దర్గా ప్లాట్లలోనూ నీరు నిలిచి ఇబ్బంది కరంగా మారింది. 16 అంతస్తుల అపార్ట్ మెంట్ పక్కన ఖాళీ స్థలంలో నుంచి వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఎంతో కాలంగా నీరు నిలిచి ఉంది. విపరీతంగా దోమలు వస్తున్నాయని, ఇళ్ల కిటీకీలు తెరిచే పరిస్థితి లేదని చుట్టుపక్కల నివాసాల వారు చెబుతున్నారు. ఖాళీ స్థలాలల్లో పిచ్చి మొక్కలు తొలగించాలని, చెత్తా, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక నివాసాల వారు కోరుతున్నారు. వర్షకాలం మురుగు నీరు నిల్వ కుండా చూడాలని, దోమల నివారించాలని వేడుకుంటున్నారు.



హెచ్‌బీ కాలనీలో ఖాళీ ప్లాట్‌లో పెరిగిన పిచ్చి మొక్కలు

వెంకన్న సన్నిధిలో వైభవంగా పూర్ణాహుతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పూర్ణాహుతి కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకూ పలు విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున విష్వక్సేనపూజతో వైదిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి అంతరాలయంలో నిత్య పూజలు చేశారు. అలాగే ఉభయదేవేరులతో కూడిన స్వామి వారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలతో శ్రీకృష్ణ మండపంలోకి తీసుకొచ్చారు. అనంతరం వేద పండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమ పురుషునికి వివిధ ద్రవ్యాలను హోమగుండంలో వేసి పూర్ణాహుతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా పవిత్ర విసర్జన, దక్షిణాదాన మహదాశీర్వచనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.



స్వామి వారికి పవిత్రాలను సమర్పిస్తున్న అర్చకులు



పూర్ణాహుతి ద్రవ్యాలను ఊరేగిస్తున్న ఆలయ అధికారులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్ఆర్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల (2002–07 బ్యాచ్) అపూర్వ కలయిక ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగింది. వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తూ కూడా కుటుంబసభ్యులతో కలిసి సమావేశానికి హాజరయ్యారు. రెండు దశాబ్దాల క్రితం ఇక్కడ చదువుకున్న రోజుల్లో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. అలాగే తెలిసీ తెలియని వయసులో తాము చేసిన అల్లరి పనులను తలచుకుంటూ వాటి వలన ఎవరికైనా ఇబ్బంది కలిగి ఉండవచ్చని బాధపడ్డారు. ప్రస్తుతం ఎవరు ఏ స్థాయిలో ఉన్నప్పటికీ అందరం ఒక చోట సమావేశం కావటం ఎంతో సంతోషంగా ఉందని భావిస్తూ ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ముచ్చటించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల్లో ఒకరైన నరసింహారెడ్డి అనారోగ్యంతో ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నందున కొంత మొత్తాన్ని సేకరించి సహాయం అందజేశారు. భవిష్యత్‌లో మన బ్యాచ్ విద్యార్థుల ఆర్థిక అవసరాలకు చేయూత ఇచ్చేందుకు కొంత మొత్తాన్ని బ్యాంకింగ్ చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇలా అప్పుడప్పుడు ఆత్మీయ కలయిక జరగాలని ఆకాంక్షించారు. కాగా నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు పాడుగు శ్రీనివాసరావు, మేళ్లచెరువు శారద, పులిపాటి దుర్గారావులను సత్కరించారు. సమావేశంలో అనిల్, మోహన్, రాము, జక్రయ్య, అప్సర్, గౌరి, బిందు, అనూష, భారతి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం నిర్వహణకు సహకరించిన జీఎస్ఆర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీవీ రవికుమార్‌కు పూర్వ విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.



జీఎస్ఆర్ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పోటాపోటీగా నర్తించిన చిన్నారులు




నృత్య పోటీలో పాల్గొన్న చిన్నారులతో కలెక్టర్ లక్ష్మీశ, చంద్రశేఖర్

- హరిత బెరంపార్క్‌లో నృత్య పోటీలు
- ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకే పోటీలు: కలెక్టర్ లక్ష్మీశ

భవానీపురం(విజయవాడపశ్చిమ):జిల్లా యంత్రాంగం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో నిర్వహిస్తున్న సంప్రదాయ నృత్య పోటీల్లో భాగంగా ఆదివారం రెండవ కేటగిరికి చెందిన 7–10 ఏళ్ల వయసుగల చిన్నారులు పోటాపోటీగా నర్తించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ కళలకు కాణాచిగా ప్రసిద్ధి చెందిన ఉమ్మడి కృష్ణా జిల్లాలో కళా సంపదను మరింత పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భావి తరాలకు కళా సంపదను వారసత్వంగా అందించేందుకు విజయవాడ టాలెంట్ పోటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. తద్వారా వారిలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించనున్నామని తెలిపారు. కళా ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్య తీసుకువచ్చేందుకు అవకాశం ఉందన్నారు. సుసంపన్న ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ సాకారానికి పర్యావరణ పరిరక్షణ కీలకమని, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి చెక్ పెట్టి స్వచ్ఛతా మార్గంలో పయనించేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికార యంత్రాంగం, నగర పాలక సంస్థ, వివిధ భాగస్వామ్య పక్షాల సహాయంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.





వేదికపై నృత్యం చేస్తున్న చిన్నారులు



మర్యాదపూర్వక కలయిక



భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఎస్సీ నాయకులు కామెళ్ల జోజి మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యవర్గ కార్యదర్శిగా ఇటీవల నియమితులైన జోజి ఆదివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి కలిసి ధన్యవాదాలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని కామెళ్ల జోజి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి కృష్ణా జిల్లా ఎస్సీ విభాగం పరిశీలకులు ముదిగొండ ప్రకాష్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల శరత్ బాబు, నక్క ప్రభుదాస్, కె కిషోర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి శీఘ్రదర్శనంలో భక్తులు



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు శ్రావణమాసం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. అమ్మవారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహనకు 2కే రన్



హనుమాన్‌జంక్షన్ రూరల్: హెచ్‌పీవీ వైరస్ ద్వారా సంక్రమించే క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు హనుమాన్‌జంక్షన్‌లో ఆదివారం 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక శేరినరసన్నపాలెం రోడ్డులోని మెడివ్యాలీ హాస్పటల్స్ నేతృత్వంలో చేపట్టిన 2కే రన్‌కు డాక్టర్లు, వైద్య సిబ్బంది, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. హెచ్‌పీవీ వైరస్ ద్వారా కలిగే క్యాన్సర్‌ను నిరోధించటానికి వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



భవానీపురం(విజయవాడపశ్చిమ): యోగా సాధనతో సంపూర్ణ శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు యోగ సాధకులు తెలిపారు. శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం (మంగళగిరి) 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ భవానీపురం–1 శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఒకటవ శాఖ అధ్యక్షుడు గుండు జనార్దనరావు, యోగాచార్యులు కళాధర్ యోగి నేతృత్వంలో విద్యాధరపురంలోని సరస్వతి నిలయం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. నిత్య జీవితంలో యోగా చేయటం వలన కలిగే ఫలితాల గురించి వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే సంస్థ వ్యవస్థాపకులు శ్రీవెంకటేశ్వర యోగి గురూజీకి జేజేలు పలికారు. దైనందిన జీవితంలో యోగ సాధనకు కొంత సమయాన్ని కేటాయించాలని, తద్వారా దీర్ఘకాలిక వ్యాధులు దూరం అవుతాయని తెలిపారు. దాదాపు వంద మందికిపైగా యోగా సాధకులు పాల్గొన్న ఈ పాదయాత్ర పలు వీధులగుండా సాగుతూ తిరిగి సరస్వతి నిలయం వద్దకు చేరుకుంది. పరుచూరు లక్ష్మీ ప్రసాద్, వక్కలగడ్డ శ్రీధర్, శిరంశెట్టి వెంకటేశ్వరరావు, జనపాల శ్రీనివాసరావు, గంజి రంగనాయకులు రెడ్డి, శాఖ సభ్యులు పాల్గొన్నారు.